సాక్షి సిద్దిపేట
బుధవారం • 1 • మార్చి • 2023



గుండెపోటుతో కండక్టర్ మృతి

గజ్వేల్– ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోలో కండక్ట ర్‌గా పని చేస్తున్న పి.భిక్షపతి(49) సోమవారం రాత్రి నర్సాపూర్‌లో గుండె పోటుతో మృతి చెందాడు. 8లో..



రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్న కేంద్రం

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతూ అభివృద్ధిని అడ్డుకుంటుందని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఆరోపించారు. 8లో..



దర్జీలను ప్రభుత్వం ఆదుకోవాలి

దుస్తులను కుడుతూ ఉపాధి పొందుతున్న దర్జీలను ప్రభుత్వం ఆదుకోవాలని మేర సంఘం నాయకులు డిమాండ్ చేశారు. 9లో..

న్యూస్‌రీల్

ప్రభుత్వ కబ్జా భూముల సర్వే షురూ



సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కోహెడ(హుస్నాబాద్): కబ్జాకు గురైన కోహెడలోని సర్వే నంబర్ 768 బాడుగుల చెరువు శిఖం 47.30 ఎకరాలు, సర్వే నంబర్ 1,229లోని 6.30 ఎకరాలు, సర్వే నంబర్ 1,227లోని 2.10 ఎకరాలు ప్రభుత్వ భూమి సర్వేను మంగళవారం మండల రెవెన్యూ అధికారులు ప్రారంభించారు. పూర్వపు హద్దు రాళ్లను గుర్తించడంలో వారు నిమగ్నమయ్యారు. హద్దుల గుర్తింపు సుమారు నాలుగు రోజుల సమయం పడుతుందని సర్వేయర్ జైపాల్‌రెడ్డి తెలిపారు. హద్దుల గుర్తింపు పూర్తయిన అనంతరం జిల్లా కేంద్రం నుంచి ఏడీ లేదా డీఏ రానున్నట్లు వివరించారు. సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని బీజేపీ, సీపీఐ, వివిధ సంఘాల నాయకులు గుగ్గిళ్ల శ్రీనివాస్, మంద సురేష్, గోవిందు సురేశ్, ముంజ విద్యాసాగర్, వెల్పుల శంకర్, రమేశ్ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఐ హరీశ్, పంచాయితీ కార్యదర్శి రఫీ, వీఆర్‌ఏలు శ్రీనివాస్,మహేందర్,ఎల్లయ్య పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకే సైన్స్ ఎగ్జిబిషన్స్

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

గజ్వేల్: విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీయడానికి సైన్స్‌ఎగ్జిబిషన్స్ దోహదపడతాయని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సైన్స్‌డే సందర్భంగా మంగళవారం గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సెయింట్ విద్యానికేతన్ పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనను తిలకించి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు విరివిగా జరగాలన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి ఉపాధ్యాయులు తమదైన శైలిలో ప్రయత్నించాలన్నారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా సైతం ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌ను సందర్శించి విద్యార్థుల ప్రతిభను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, ఎంఈఓ సునీత, మున్సిపల్ కౌన్సిలర్లు అర్చన, వరలక్ష్మి, పాఠశాల కరస్పాండెంట్ ఇన్నారెడ్డి, డైరెక్టర్ థామస్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు విజయపాల్‌రెడ్డి, రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాలు వెంటనే మాఫీ చేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): రైతులకు రూ. లక్ష రుణమాఫీ వెంటనే అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని చంద్లాపూర్, పెద్దకోడూరు గ్రామాల్లో స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఏక కాలంలో రుణమాఫీ చేస్తామని ప్రకటించి, నేటి వరకు చేయలేదన్నారు. కౌలు రైతులకు కూడా రైతుబంధు అమలు చేయాలన్నారు. రైతాంగానికి 24 గంటల విద్యుత్ ఇస్తామని చెప్పి, నేడు 8 గంటలు కూడా సరిగా ఇవ్వకపోగా మోటార్లకు ఉన్న ఆటోమెటిక్ స్టార్టర్లు తీసేసి రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పిట్ల పరుశరాములు, నాయకులు శేఖర్‌గౌడ్, భూమేశ్ గౌడ్, రాజిరెడ్డి, మహేందర్‌రెడ్డి, నిమ్మల శ్రీనివాస్, శివరాంగౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పట్టాలు

జీఓ 58, 59 కింద పంపిణీకి ఏర్పాట్లు

- గతేడాదిలోనే అధికారుల సర్వే పూర్తి
- త్వరలో మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా అందజేత

సాక్షి, సిద్దిపేట: ప్రభుత్వ భూమిలో ఇళ్లు నిర్మించుకున్న వారికి 58, 59 జీఓ కింద త్వరలోనే రెగ్యులరైజేషన్ పట్టాలు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గతేడాది మార్చిలో స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన అనంతరం 59 జీవో పరిధిలోకి వచ్చే దరఖాస్తులకు డిమాండ్ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసుల్లో పేర్కొన్న సొమ్మును మూడు దఫాలుగా ప్రభుత్వానికి చెల్లించారు. ఈ నేపథ్యంలో రెగ్యులరైజేషన్ కన్వేయన్స్ డీడ్స్ (పట్టాలు) రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఈ ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభమైంది. త్వరలో మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా 4,196 మంది

ప్రభుత్వ స్థలాల్లో 2014 కంటే ముందు ఇంటి నిర్మాణం చేసుకున్న వారికి క్రమబద్ధీకరణ చేసేందుకు 58, 59 జీవోల ద్వారా దరఖాస్తులను స్వీకరించారు. 58 జీవోకు 486 దరఖాస్తులు, 59జీవోకు 4,196 మంది దరఖాస్తు చేశారు.

- 14 బృందాల ద్వారా క్షేత్రస్థాయిలో సర్వేలు చేయించారు. ఇంటి స్థలాలకు సంబంధించిన డాక్యుమెంట్లు, ఇంటి పన్నులు, విద్యుత్ బిల్లులు తదితరాలను పరిశీలించి అర్హులను గుర్తించారు.



సిద్దిపేట అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో బయోమెట్రిక్ ద్వారా థంబ్ ఇంప్రెషన్ వేస్తున్న తహసీల్దార్ విజయ్ సాగర్, పక్కన ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ సంతోష్

- 58 జీవోకు 486 దరఖాస్తులు రాగా అందులో 48 మంది అర్హులుగా, 59జీఓకు వచ్చిన 4,196 దరఖాస్తుల్లో 1,982 మందికి డబ్బులు చెల్లించేందుకు డిమాండ్ నోటీసులను జారీ చేశారు. కొన్ని దరఖాస్తులు సీసీఎల్‌లో పెండింగ్‌లో ఉండగా మరి కొన్ని రిజెక్ట్ అయ్యాయి.
- ఇప్పటి వరకు 293 మంది వంద శాతం డబ్బులను చెల్లించారు.
- 1,982 మందికి క్రమబద్ధీకరణకు ఓకే చెప్పారు. సిద్దిపేట అర్బన్ మండలం దరఖాస్తులు 1,767, కొండపాక 45, వర్గల్ 45, ములుగు 44, గజ్వేల్ 13, కొమురవెల్లి 14, మిరుదొడ్డి 11 మిగతా మండలాలు 48 చొప్పున దరఖాస్తులున్నాయి. ఇప్పటి వరకు 293 మంది పూర్తి స్థాయిలో డబ్బులు చెల్లించగా అందులో 241 మంది సిద్దిపేట అర్బన్ వారే ఉన్నారు.

లబ్ధిదారుడి ఫొటోతో..

రెగ్యులరైజేషన్ కింద పూర్తి పేమెంట్ చేసిన వారి వివరాలను మీసేవ వెబ్ పోర్టల్‌లో ఉంచారు. తహసీల్దార్లు బయోమెట్రిక్ ద్వారా కన్వేయెన్స్ డీడ్స్‌ను జనరేట్ చేసేలా వెసులుబాటు కల్పించారు. పూర్తి వివరాలను క్రాస్ చెక్ చేసుకున్న తర్వాతే ఈ డీడ్స్‌ను డౌన్‌లోడ్ చేస్తున్నారు. ఒక పక్కన కేసీఆర్ ఫొటో.. మరో పక్కన లబ్ధిదారుని ఫొటోతో కన్వేయెన్స్ డీడ్స్‌పై తహసీల్దార్ సంతకం చేసి రిజిస్ట్రేషన్ చేయనున్నారు. ఈ ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభమైంది.

- ఈ పట్టాలను త్వరలో మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల సమక్షంలో అందించనున్నారు. ఇందుకోసం జిల్లా యంత్రాంగం సంబంధిత ఏర్పాట్లను సిద్ధం చేస్తోంది.

అందరి సహకారంతోనే..

కమిషనర్‌గా విధులు విజయవంతం

- పుట్టి, పెరిగింది.. విద్యాభ్యాసం అంతా సిద్దిపేటలోనే
- బదిలీపై వెళ్తున్న సిద్దిపేట బల్దియా కమిషనర్ రవీందర్‌రెడ్డి

సాక్షి, సిద్దిపేట: 'పుట్టి, పెరిగి, చదువుకున్న చోట విధులు నిర్వర్తించడం నా కుటుంబ సభ్యులకు సేవ చేసినట్లుగా అనిపించింది. మంత్రి హరీశ్‌రావు ఆదేశాలు, సలహాలు, సూచనలతో జాతీయ స్థాయిలో సిద్దిపేట పట్టణానికి గుర్తింపు తీసుకొచ్చేందుకు నా వంతు కృషి చేశాను.' అని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి అన్నారు. ఆయన తన మాతృ శాఖ రెవెన్యూకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా మంగళవారం 'సాక్షి' పలకరించింది. ఆయన మాటల్లోనే..

చదువుకున్న చోటనే..

మాది నంగునూరు మండలం తమ్మాయపల్లి గ్రామం. పదో తరగతి వరకు ఇంటి దగ్గర స్కూల్‌లోనే చదుకున్న. ఇంటర్, డిగ్రీ సిద్దిపేట పట్టణంలోనే చదివాను. నేను విద్యాభ్యాసం చేసిన చోటనే మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించే అవకాశం రావడంతో నా కుటుంబ సభ్యులతో కలిసి పని చేసినట్లుగా అనిపించింది. గతేడాది జనవరి 13న మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించాను. మంత్రి హరీశ్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది అందరి సహకారంతో ముందుకు సాగాను. సిద్దిపేట మున్సిపాలిటీని జాతీయ స్థాయిలో లక్షకుపైగా జనాభా గల పట్టణాల జాబితాలో టాప్ 20లో గుర్తింపు తీసుకొచ్చేందుకు నా



మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

వంతు కృషి చేశాను. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో స్టార్ రేటింగ్ సర్టిఫికేషన్, రెవెన్యూ వంద శాతం కలెక్షన్, మూడు ఐఎస్‌ఓ సర్టిఫికెట్లు, రాష్ట్ర స్థాయిలో హరిత హారానికి అవార్డులు వచ్చాయి. అలాగే నర్సాపూర్ ఎస్‌టీపీ పూర్తి చేశాం. రంగనాయకసాగర్ వద్ద 16 ఎకరాల్లో 2 లక్షల మొక్కలతో పెద్ద నర్సరీని ఏర్పాటు చేశాం.

ఎంతో సంతృప్తినిచ్చింది

రెవెన్యూలో ఎక్కువగా రెగ్యులటరీ, అడ్మినిస్ట్రేషన్ ఉంటుంది. అదే మున్సిపల్ శాఖలో సంక్షేమం, అభివృద్ధి, ప్రజలతో మమేకమయ్యే అవకాశం కలిగింది. దీంతో నా కెరీర్‌లో ఇది ఎంతో ఉపయోగపడనుంది. నేను ఇక్కడ విధులు నిర్వర్తించడం ఎంతో సంతృప్తినిచ్చింది. ప్రజా ప్రతినిధులు, ప్రజలు, అధికారుల సహకారం మరువలేనిది.

పథకాల అమలు తీరు భేష్



క్రీడా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నాలుగు రాష్ట్రాల అధికారుల బృందం కితాబు

ములుగు(గజ్వేల్): నర్సరీలో వివిధ రకాల మొక్కల పెంపకం, ఆహ్లాదకరమైన వాతావరణంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటుతో పాటు ఇక్కడ అమలు చేస్తున్న పథకాల తీరు బాగుందని నాలుగు రాష్ట్రాల అధికారుల బృందం కితాబు ఇచ్చింది. మంగళవారం ములుగు మండల కేంద్రంలో మంగళవారం తమిళనాడు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాలకు చెందిన అధికారుల బృందం పర్యటించింది. ఈ బృందంలో కేరళ డిప్యూటీ డెవలప్‌మెంట్ కమిషనర్ రవిరాజు, జాయింట్ ప్రొగ్రాం కోఆర్డినేటర్ సాజీక్లీమెంట్, తమిళనాడు ఐటీ ప్రొఫెషనర్ రోహిత్, ఏడీఈ మహేశ్‌కుమార్‌తో పాటు మరో 25 మంది ఉన్నారు. ఈ సందర్భంగా అదనపు డీఆర్డీఓ కౌసల్యాదేవి పథకాల అమలు తీరును వారికి వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఐఆర్డీ ప్రోగ్రాం కోఆర్డినేటర్లు రాజ్‌కుమార్, మునీర్, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శాంతి, ఎంపీటీసీ ప్రవీణ్, బీఆర్‌ఎస్ నాయకుడు అర్జున్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోవారం రూ.66 లక్షలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరోవారం బుకింగ్ ఆదాయం రూ.66,01,753 సమకూరినట్లు ఆలయ బుకింగ్ ఇన్‌చార్జి మాధవి మంగళవారం తెలిపారు. స్వామి వారి దర్శానానికి వచ్చిన భక్తులు మొక్కుల్లో భాగంగా తలనీలాలు, పట్నాలు, బోనాల సమర్పణ, ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలు, వసతి గదుల అద్దె, ప్రసాద విక్రయాలు మెదలగు వాటి ద్వార శనివారం రూ. 4,49,960, ఆదివారం రూ.51,96,506, సోమవారం రూ.9,55,287 చొప్పున ఈ మూడు రోజుల్లో మొత్తం రూ.66,01,753 సమకూరినట్లు తెలిపారు.

రేపు హుండీ ఆదాయం లెక్కింపు

స్వామి వారి హుండీ ఆదాయాన్ని రేపు (2వ తేదీన)లెక్కిస్తామని ఈవో బాలాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు వేసిన కానుకలతో హుండీలు నిండిపోయాయన్నారు. వాటిని గురువారం ఓపెన్ చేసి లెక్కింపు నిర్వహించి నగదును బ్యాంకులో జమచేయనున్నట్లు తెలిపారు. బియ్యం హుండీలను తెరిచి బియ్యాన్ని తూకం వేయనున్నట్లు పేర్కొన్నారు.

రేపు హుస్నాబాద్‌లో హాథ్ సే హాథ్ జోడో



మాట్లాడుతున్న నర్సారెడ్డి, పక్కన ప్రవీణ్‌రెడ్డి, తదితరులు

హుస్నాబాద్: టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడోను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలకు సూచించారు. వారు హుస్నాబాద్ పట్టణంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈ యాత్ర బుధవారం రాత్రి హుస్నాబాద్‌కు చేరుకుంటుందన్నారు. అక్కన్నపేట మండలంలోని కట్కూర్ క్రాసింగ్ వద్ద బస చేయనున్నారని తెలిపారు. మార్చి 2వ తేదీ ఉదయం 9 గంటలకు భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామిని దర్శించుకొని యాత్ర ప్రారంభమవుతుందన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సందేశాన్ని ప్రజలకు తెలియజేసేందుకే ఈ యాత్రను నిర్వహిస్తున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.2లక్షల రుణమాఫీతో పాటు రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇవ్వనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ హయాంలో దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి ఇల్లు కట్టించామని గుర్తు చేశారు. కానీ తెలంగాణ ప్రభుత్వంలో ఏ ఒక్కరికి ఇల్లు కట్టించిన పాపాన పోలేదన్నారు. సమావేశంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, డీసీసీ కార్యదర్శి చిత్తారి రవీందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, సరోజన, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రజిత, నాయకులు ఎగ్గిడి అయిలయ్య, మైదంశెట్టి వీరన్న, కర్ర రవీందర్ రెడ్డి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారించండి

త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తాం

- హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ సుంకె రాజమల్లయ్య
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌కు అనూహ్య స్పందన

కుక్కలు, కోతులు, పందుల బెడదను తొలగించాలి



ఫోన్‌లో సమస్యలు వింటున్న హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య

హుస్నాబాద్, హుస్నాబాద్‌రూరల్: 'మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటాం. కుక్కలు, కోతులు, పందుల నివారణకు కౌన్సిల్ సమావేశంలో చర్చించి వాటి నివారణకు కృషి చేస్తాం.' అని హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య అన్నారు. మంగళవారం నిర్వహించిన సాక్షి ఫోన్‌ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ప్రధానంగా మిషన్ భగీరథ నీళ్లు, కోతులు, కుక్కలు, పందులతో పాటు పారిశుధ్య సమస్యల పరిష్కారానికి అధికంగా ఫిర్యాదులు వచ్చాయి.

- ఐదు రోజులుగా మిషన్ భగీరథ తాగు నీరు సరఫరా కావడం లేదు. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోండి.

–కవ్వ వేణుగోపాల్‌రెడ్డి (గాంధీ చౌరస్తా), కె. శ్రీనివాస్ (4వ వార్డు)

మున్సిపల్ కమిషనర్: భగీరథ తాగునీరు సరఫరా చేసే ఎల్‌ఎండీ దగ్గర మరమ్మతులు చేస్తున్నారు. అందుకే సరఫరా తాత్కాలికంగా నిలిచిపోయింది. రెండు, మూడు రోజుల్లో నీటి సరఫరా చేస్తారు. బోరుకు తాళం వేసిన విషయంపై సిబ్బందిని పంపించి తెరిపిస్తాం.

- కొత్త ఇల్లు కట్టుకున్నాం. మురికి కాల్వలు లేక దోమలు విపరీతంగా ఉంటున్నాయి. దీంతో అనారోగ్యాలకు గురవుతున్నాం. వెంటనే మురికి కాల్వలను నిర్మించండి.

–డి. చంద్రశేఖర్, 14వ వార్డు,

మున్సిపల్ కమిషనర్: పట్టణ శివారు కాలనీలల్లో రోడ్డు, మురికి కాలువల నిర్మాణాలకు నిధులు మంజూరైన తర్వాత నిర్మిస్తాం. తాత్కాలికంగా కందకం ద్వారా మురికి నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకుంటాం.

- మురికి కాల్వలు తీయడం లేదు. దీంతో దుర్వాసన వస్తుంది. అలాగే దోమల వ్యాప్తి పెరిగి ఇబ్బందులు పడుతున్నాం.

–శ్రీనివాస్, గణేశ్‌నగర్, బత్తుల శ్రీనివాస్, హుస్నాబాద్

మున్సిపల్ కమిషనర్: సిబ్బందిని అన్ని పనులకు వాడుతున్నాం. మురికి కాల్వలను కూడ ఉన్న సిబ్బందితో తీయిస్తున్నాం. మీ కాలనీలో రెండు రోజుల్లో కాల్వలను శుభ్రం చేయించి సమస్యను పరిష్కరిస్తాం.

- రోడ్డుకు అడ్డం కంప వేసింద్రు. పట్టణంలోని 5,6 వార్డుల్లో రోడ్డుకు అడ్డంగ కొందరు ముళ్ల కంప వేయడంతో ఇబ్బందిగా మారింది. ప్లాట్ కొనుగోలు పత్రాలను పరిశీలించి దారి సమస్యను పరిష్కరించండి.

–కోటి వెంకటేశ్వర్లు(హనుమాన్‌నగర్), కొత్తపల్లి మహేందర్ (5వ వార్డు)

మున్సిపల్ కమిషనర్: హనుమాన్‌నగర్‌లో గతంలోనే రోడ్డు సమస్యను పరిష్కరించాం. ఇప్పుడు అలాంటి సమస్య 5, 6 వార్డుల్లో ఉంటే మా సిబ్బందిని పంపించి విచారణ చేయిస్తాం. రోడ్డుకు అడ్డం వేసిన కంపను తొలగించి సమస్యను తీర్చుతాం. కాలనీవాసులు సహకరిస్తే సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది.

- పాత బావి పూడ్చుకుంటూ హద్దులు చేర్పుతున్నారు. 6వ వార్డు మసీదు వెనుక పాత బావిని పూడ్చుకుంటూ భూమి హద్దులను చెరిపి వేస్తున్నారు.

–పున్న రమేశ్, 6వ వార్డు

మున్సిపల్ కమిషనర్: పాత బావులను పూడ్చే కార్యక్రమం ఇప్పుడు లేదు. ప్రభుత్వం మళ్లీ పెడితే అప్పుడు పాత బావులను పూడ్చుటకు చర్యలు తీసుకుంటాం. హద్దులు మార్చుతున్నారంటే మీ ప్లాట్ పత్రాలను అధికారులకు చూపిస్తే చర్యలు తీసుకుంటారు.

- హుస్నాబాద్ పట్టణం రోజు రోజుకు విస్తరిస్తుంది. శివారులోని పోతారం(ఎస్), పందిల్ల రోడ్డు వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలి. లైటింగ్ లేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

–అయిలేని మల్లికార్జున్ రెడ్డి, టీచర్స్ కాలనీ

మున్సిపల్ కమిషనర్: సెంట్రల్ లైటింగ్ సిస్టం నిధులతో ముడిపడి ఉంది. ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు వస్తే తప్పకుండా ఏర్పాటు చేస్తాం.

- ఆరపల్లె శివారులో గొర్రెలు, బర్రెలు చాలా ఉన్నాయి. దీంతో దోమలు ఎక్కువగా ఉన్నాయి. అలాగే మురికి కాల్వల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లండి...

–మ్యాదరబోయిన వేణుయాదవ్, ఆరపల్లె

మున్సిపల్ కమిషనర్: పట్టణమంతా దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నాం. వారం రోజుల్లో మీ వీధిలోనూ ఫాగింగ్ చేయించి దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం.

- తారు రోడ్డు నిర్మించి సైడ్‌బర్మ్‌లు నిర్మించకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే సైడ్‌బర్మ్‌లు నిర్మించాలి.

–వడ్డెపల్లి మల్లేశం, రిటైర్డు టీచర్, అక్కన్నపేట రోడ్

మున్సిపల్ కమిషనర్: ఆర్‌అండ్‌బి అధికారుల దృష్టికి తీసుకెళ్లి రోడ్డుకు ఇరువైపుల మట్టి పోయించి రోడ్డు సమస్య తీర్చుతాం.

- ఓపెన్ ప్లాట్లలో చెట్లు, చెత్తాచెదారం వల్ల పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. మురికి కాల్వలు శుభ్రం చేయకపోవడంతో దోమలతో ఇబ్బందులు పడుతున్నాం.

–నేర్లేళ్ల శ్రీనివాస్, 5వ వార్డు

మున్సిపల్ కమిషనర్: ఓపెన్ ప్లాట్లలో పెరుకుపోయిన చెట్లు, చెత్తను తీయించే కార్యక్రమం ప్రస్తుతం లేదు. ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టినపుడు తొలగిస్తాం. మురికి కాల్వలను సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తాం.

- మా కాలనీకి వెళ్లలంటే గాంధీచౌరస్తా దగ్గర కుక్కలు ఎక్కువగా ఉన్నాయి. రోడ్డున పోయేవారిపై కుక్కలు దాడి చేస్తున్నాయి. పిల్లలు బయటకు పంపించాలంటే భయంగా ఉంది. పందులతో రోజు ఇబ్బంది పడుతున్నం.నివారణకు చర్యలు తీసుకోండి.

–సుంకె రాజశేఖర్ అడ్వకేట్(నల్లరాళ్లవాడ), బొల్లి సంజీవ్ (టీచర్స్ కాలనీ), వరయోగుల అనంతస్వామి (విద్యానగర్), పూదరి రవీందర్ గౌడ్, 3వ వార్డు, అయిలేని శంకర్‌రెడ్డి (8వ వార్డు), అక్కు సంధ్య(3వవార్డు), ఎండీ మొయినోద్దీన్ (17వ వార్డు)

మున్సిపల్ కమిషనర్: పందులను గతంలోనే ఒకసారి పట్టించినం. ఇప్పుడు మళ్లీ కౌన్సిల్ తీర్మానం చేసి పట్టిస్తాం. ఇళ్ల పక్కన మిగిలిన ఆహారం వేయడం వల్ల స్థావరం ఏర్పరుచుకుంటున్నాయి. అలాగే కుక్కలను చంపే అధికారం మాకు లేదు. వాటిని ఊరు చివరకు పంపించే చర్యలు తీసుకుంటాం.

క్లుప్తంగా

ప్రేమించి మోసం చేసిన యువకుడి రిమాండ్


దినేష్

చిన్నశంకరంపేట(మెదక్): యువతిని ప్రేమించి మోసం చేసిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కామారం తండాకు చెందిన డిగ్రీ చదువుతున్న యువతిని ప్రేమిస్తున్నానని చెప్పడంతో పాటు పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. తనను శారీరకంగా వాడుకుని మోసం చేశాడని యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు. యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఈ బైక్ ఎవరిదో!


ఎలుక చెరువు కట్టపై పడివున్న బైక్

కొడిపల్లి(నర్సాపూర్): చెరువు కట్టపై నాలుగు రోజులుగా బైక్ పడిఉంది. ఈ బైక్ ఎవరిదన్నది తెలియరాలేదు. కొడిపల్లి నుంచి వెలమకన్న వెళ్లేదారిలో ఎలుక చెరువు కట్టపక్కన ఏపీ 09ఏఎక్స్2852 నంబర్ ప్లేట్ ఉన్న బైక్ నాలుగు రోజులుగా ఉంది. రోడ్డుపైన ఎలాంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు. ఈ విషయయంపై కొడిపల్లి ఎస్‌ఐ శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని బైక్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తామన్నారు.

వృద్ధురాలి మృతి

కొడిపల్లి(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చి మృతి చెందినట్లు మంగళవారం ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొడిపల్లి మండలం పీర్లతండా పంచాయతీ ధర్మతండాకు చెందిన గూగ్లోత్ పీర్య, అతడి తల్లి మోతి(62)తో కలిసి ఈనెల 24వ తేదీన రాయిలాపూర్ తండాలో బంధువుల ఇంటిలో జరిగే పెళ్లికి వెళ్లారు. రాత్రి పెళ్లికి వచ్చిన బంధువులను సాగనంపే క్రమంలో రోడ్డు దాటుతుండగా నర్సాపూర్ మండలం చిన్నచింతకుంట గ్రామానికిచెందిన కాట్రోత్ బద్రు తన బైక్‌తో మోతిని ఢీకొట్టాడు. దీంతో ఆమెకు తీవ్ర గాయాలవడంతో మొదట నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. ఈనెల 27వ తేదీన ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చారు. ఇంటికి వచ్చిన తరువాత మోతి మృతి చెందింది. మృతురాలి కొడుకు పీర్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దరాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోతి దాడిలో మహిళకు తీవ్రగాయాలు


గాయపడిన స్వరూప

నర్సాపూర్: కోతి దాడి చేయడంతో ఓ మహిళ గాయపడింది. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా నర్సాపూర్ శ్రీరాంనగర్ కాలనీలో నివాసం ఉండే గూడ పెంటయ్య భార్య స్వరూప ఇంటి గేటువద్ద నిలుచొని ఉంది. అటుగా వెళ్తున్న కోతులు ఆమె చేతిని కరవడంతో గాయపడింది. బాధితురాలిని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. నర్సాపూర్‌లో కోతులు, కుక్కలతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

చిన్నశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన చిన్నశంకరంపేట మండలం మడూర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. మండలంలోని మిర్జాపల్లి గ్రామానికి చెందిన కర్రె దాసు గవ్వలపల్లి నుంచి స్వగ్రామానికి వస్తుండగా బైక్ అదుపు తప్పి కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడటంతో స్థానికులు మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గుండెపోటుతో కండక్టర్ మృతి

- డ్యూటీలో ఉండగా ఘటన
- మెమో ఇవ్వడంతో మనస్తాపానికి లోనయ్యాడంటున్న భార్య


భిక్షపతి (ఫైల్)

నర్సాపూర్: గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్న పి.భిక్షపతి (49) సోమవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. కాగా తన భర్త భిక్షపతి సోమవారం ఉదయం 6 గంటలకు డ్యూటీకి వెళ్లాడని మృతుడి భార్య బాలమణి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం డ్యూటీలో భాగంగా భిక్షపతి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ నుంచి సంగారెడ్డి వెళ్లి తిరిగి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ వస్తుండగా మధ్యాహ్నం 12.45 గంటలకు ఆర్టీసీ


భర్త చనిపోయాడని తెలుసుకుని ఆసుపత్రి వద్ద రోదిస్తున్న మృతుడి భార్య బాలమణి

టీటీఐ బస్సును తనిఖీ చేశాడు. ఓ ప్రయాణికుడు టికెట్ తీసుకోలేదని తేలడంతో టీటీఐ తనకు చార్జ్ మెమో ఇచ్చాడని భార్యకు ఫోన్ చేసి ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ నుంచి సంగారెడ్డికి రెండో ట్రిప్ వెళ్లి నర్సాపూర్ బస్టాండ్‌కు రాత్రి 8 గంటలకు వచ్చాడు. ఛాతీలో నొప్పిగా ఉందని బస్సు డ్రైవర్‌కు చెప్పడంతో అతడు బస్సును బస్టాండ్‌లో నిలిపి ఆటోలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అక్కడి డ్యూటీ డాక్టర్ వైద్య పరీక్ష చేసి రెండు ఇంజక్షన్‌లు చేసి పంపాడు. డ్రైవర్‌తో కలిసి బస్టాండ్‌కు నడుచుకుంటు వస్తుండగా ఆసుపత్రి నుంచి సుమారు వంద మీటర్లు దూరంలో మళ్లీ ఛాతీలో నొప్పి ఎక్కువైందని డ్రైవర్‌తో చెబుతూ ఊపిరి ఆడడం లేదని చెప్పి స్పృహ తప్పిపడిపోయాడు. వెంటనే డ్రైవర్ మళ్లీ ఆసుపత్రికి తీసుకెళ్లగా డాక్టర్ పరీక్షించి చనిపోయాడని ధ్రువీకరించాడు. టీటీఐ చార్జ్‌మెమో ఇవ్వడంతో తన భర్త భిక్షపతి మనస్సులో పెట్టుకుని బాధపడటం వల్లే గుండెపోటు వచ్చి మరణించాడని మృతుడి భార్య బాలమణి కన్నీటి పర్యంతమైంది. తన భర్త మరణంపై ఎలాంటి అనుమానం లేదని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. కాగా మృతుడి భార్య బాలమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు చెప్పారు.

మంచి కండక్టర్

భిక్షపతి మంచి కండక్టర్ అని గజ్వేల్- ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ చెప్పారు. విధులను సక్రమంగా నిర్వర్తించేవాడని, అతడిపై ఎలాంటి ఆరోపణలు లేవని, తన డ్యూటీ తాను చేసుకునే వాడన్నారు.

కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు

కండక్టర్ పి.భిక్షపతి సోమవారం రాత్రి డ్యూటీలో ఉండి గుండెపోటుతో చనిపోవడంతో అదే రాత్రి మృతుడి భార్య బాలమణి, ఇతర కుటుంబీకులు, బంధువులు, మిత్రులు నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. వారి రోదనలతో ఆసుపత్రి ఆవరణలో విషాదం నెలకొంది. మృతుడికి భార్య బాలమణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కూతురు సౌమ్య ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతుండగా, రెండో కూతురు సుమ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుందని తెలిసింది. మృతుడి స్వగ్రామం సిద్దిపేట జిల్లా ఎస్‌సాన్‌పల్లి గ్రామ ఎంపీటీసీ సభ్యుడు ప్రశాంత్‌గౌడ్, పలువురు నాయకులు వచ్చి మృతుడి కుటుంబానికి అండగా నిలిచారు.

హత్యకేసులో నిందితుడి పట్టివేత

- డబ్బుల కోసం స్వామిని అంతమొందించిన అనుచరుడు
- 45 రోజుల క్రితం దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు
- సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా చిక్కిన నిందితుడు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ

పాపన్నపేట(మెదక్): సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా పోలీసులు హత్య కేసు ఛేదించారు. స్వామి అవతారం ఎత్తి జీవనం సాగిస్తున్న ఓ వ్యక్తిని డబ్బుల కోసం అతడి అనుచరుడు బండరాయితో మోది ఏడుపాయల్లో అంతమొందించాడు. 45 రోజులుగా కొనసాగిన సస్పెన్స్‌కు తెరపడింది. పాపన్నపేట పోలీసులు హంతకుడిని మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. పాపన్నపేట ఎస్‌ఐ విజయ్ నారాయణ్, మెదక్ రూరల్ సీఐ విజయ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ కర్నూల్ పట్టణం శివప్పనగర్ కాలనీ, కలుగూరి ఎస్టేట్‌కు చెందిన బైలుపాటి రంగస్వామి(65) చిన్నపాటి స్వామిగా చెలామణి అవుతున్నాడు. ప్రజలకు జాతకాలు చెబుతూ, తాయెత్తులు కడుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. తరచూ ఏడుపాయలకు వస్తున్నాడు. జనవరి 9వ తేదీన జోగిపేటకు వచ్చి పోచమ్మ ఆలయంలో నిద్రించాడు. ఈ ఆలయంలో నెలకు రూ.500 వేతనంతో పనిచేస్తున్న గొల్ల నర్సింహులుతో పరిచయమైంది. అదే వేతనం తాను ఇస్తానని, తన వెంట రావాలని రంగస్వామి కోరడంతో అతడు ఒప్పుకున్నాడు. దీంతో ఇద్దరూ కలసి జనవరి 13వ తేదీన ఏడుపాయలకు వచ్చారు. అక్కడ ఓ భక్తుడికి తాయెత్తు కట్టడంతో అతడు రూ.8 వేలు ఇచ్చాడు. అందులో నుంచి రూ.500లు నర్సింలుకు ఇచ్చాడు. అయితే అతను ఎక్కువ డిమాండ్ చేసినా ఇవ్వలేదు. అదే రోజు సాయంత్రం ఇద్దరు కలసి ఏడుపాయల్లో మద్యం తాగారు. ఈ క్రమంలో మరోసారి ఇద్దరూ గొడవపడ్డారు. దీంతో నర్సింహులను రంగస్వామి కొట్టాడు. కోపంతో నర్సింలు తిరగబడి బండరాయితో మోదడంతో రంగస్వామి మరణించాడు. అతడి సెల్ ఫోన్, డబ్బులు తీసుకొని జోగిపేట వెళ్లాడు. అక్కడ సెల్ ఫోన్‌ను ఓ దుకాణంలో అమ్మాడు. అయితే దుకాణం యజమాని నర్సింలు ఆధార్ కార్డు తీసుకున్నాడు. అప్పట్లో గుర్తు తెలియని శవంగా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

హంతకుడిని పట్టిచ్చిన సెల్ ఫోన్

పాపన్నపేట ఎస్‌ఐ విజయ్ నారాయణ్, కానిస్టేబుళ్లు దుర్గాప్రసాద్, బస్వరాజ్‌లు కేసును సవాలుగా తీసుకొని హంతకుడి కోసం వేట ప్రారంభించారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా ఫోన్ కొనుగోలు చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడు ఆధార్ కార్డు ఇవ్వడంతో నర్సింహులును అదుపులోకి తీసుకొని విచారించారు. హత్య చేసినట్లు నిర్ధారణ అయ్యింది.

ఇబ్బందులకు గురైతే ఫిర్యాదు చేయాలి

సిద్దిపేట టూటౌన్ సీఐ రవికుమార్


మహిళలకు అవగాహన కల్పిస్తున్న సీఐ రవికుమార్

సిద్దిపేటకమాన్: మహిళలు వరకట్నం, గృహహింస, పనిచేసే ప్రదేశాల్లో ఏమైనా ఇబ్బందులకు గురైతే డయల్ 100 లేదా, పోలీసులకు ఫిర్యాదు చేయాలని సిద్దిపేట టూటౌన్ సీఐ రవికుమార్ అన్నారు. మంగళవారం సిద్దిపేట టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా చట్టాలు, వరకట్న వేధింపులు, గృహహింస తదితర అంశాలపై సీఐ అవగాహన కల్పించారు. మహిళలు, యువతులు, కళాశాల విద్యార్థినులు ఇబ్బందులకు గురైతే తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీరామ్, పోలీసు సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు తల్లి చెంతకు


బాలుడిని తల్లికి అప్పగిస్తున్న హెడ్ కానిస్టేబుల్

శివ్వంపేట(నర్సాపూర్): తప్పిపోయిన మూగబాలుడిని పోలీసులు తల్లిచెంతకు చేర్చారు. ఈ సంఘటన మండల కేంద్రమైన శివ్వంపేటలో మంగళవారం చోటుచేసుకుంది. గూడూర్ గ్రామానికి చెందిన నిరుడి మంజుల, రవి దంపతులకు కుమారుడు మనోజ్ (11) ఉన్నాడు. అతడికి మాటలు రావు. మంగళవారం ఇంటి నుంచి వెళ్లి తప్పిపోయి కిలోమీటర్ దూరంలో ఉన్న శివ్వంపేట గ్రామంలో తిరుగుతున్నాడు. వీధి కుక్కలు వెంటబడటంతో ఎదుల్లాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి కుక్కల బారి నుంచి రక్షించాడు. 100 డయల్ చేసి సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి మనోజ్‌ని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. తప్పిపోయిన బాలుడి ఆచూకీ తెలుసుకునేందుకు వాట్సప్ గ్రూపుల్లో పోస్ట్ చేశారు. విషయం తెలుసుకున్న బాలుడి తల్లి మంజుల పోలీస్‌స్టేషన్‌కు రావడంతో హెడ్‌కానిస్టేబుల్ సాయిలు కుమారుడిని తల్లికి అప్పగించారు.

ప్రజలకు మరింత చేరువ కావాలి

సీడీపీఓ రమాదేవి


మాట్లాడుతున్న సీడీపీఓ

చిన్నకోడూరు(సిద్దిపేట): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవా కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ రమాదేవి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని గంగాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, పుట్టబోయే చిన్నారులు, పుట్టిన బిడ్డలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు పని చేయాలన్నారు. నెల నెలా తీసుకోవాల్సిన ఆహారం అలవాట్లు, సలహాలు, సూచనలు చేయాలని సూచించారు. ఆట పాటలతోనే చిన్నారులు శారీరక, మానసిక ఎదుగుదల బాగుంటుందన్నారు. విద్యార్థులను వినూత్న బోధన అందించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, సర్పంచ్ లింగారెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం భూమయ్య, అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి



విద్యార్థులకు అభ్యసన సామగ్రిని అందజేస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

ములుగు(గజ్వేల్) : విద్యార్థులు పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ములుగు మండలం క్షీరసాగర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన జాతీయ వైజ్ఞానిక దినోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పది పరీక్షల్లో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలన్నారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించడం అభినందనీయమన్నారు. పూర్వ విద్యార్థులు కందాడి శంకర్‌రెడ్డి, కర్నాటి మంజుల చెరో రూ.50 వేల చొప్పున అందజేసిన ఆర్థిక సహకారంతో పాఠశాలలో ఏర్పాటు చేసిన అబ్దుల్ కలాం స్మారక ప్రయోగశాల, నూతన గ్రంథాలయాన్ని డీఈఓ ప్రారంభించారు. పదో తరగతి విద్యార్థులకు అభ్యసన సామగ్రిని అందజేశారు. విద్యార్థులకు ఉచిత మినరల్ వాటర్‌ను అందజేస్తున్న అన్నసాగర్ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, పాఠశాలను దత్తత తీసుకుని అభివృద్ధికి సహకరిస్తున్న కేబీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొన్యాల బాల్‌రెడ్డిని డీఈఓ సత్కరించారు. పది పరీక్షల్లో పది జీపీఏ సాధించిన విద్యార్థులకు తగిన ప్రోత్సహకాలు అందజేయడంతో పాటు పాఠశాలలకు ప్రత్యేక నిధులు మంజూరు చేయనున్నట్లు మంత్రి హరీశ్‌రావు తెలిపారని డీఈఓ వెల్లడించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశం, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, మాధవి, రజనీకుమారి, తిరుపతిరెడ్డి, ఇతర పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొలంలో నాగుపాము కలకలం


కొట్టాలలో నాగుపామును పట్టుకున్న రైతు

కొడిపల్లి(నర్సాపూర్): వరి పొలంలో పనులు చేస్తున్న రైతులకు నాగుపాము కనిపించింది. దీంతో ఒక్కసారిగా భయాందోళన చెందారు. మరో రైతు దానిని పట్టుకొని అడవిలో వదిలేశాడు. కొడిపల్లి మండలం కొట్టాల గ్రామానికి చెందిన గొరకంటి నరహరి తన పక్కపొలంలో పాము వచ్చిందని రైతులు కేకలు వేయడంతో అక్కడికి వెళ్లాడు. అక్కడ నాగుపాము ఉన్నట్లు గమనించాడు. పామును నేర్పుగా పట్టుకొని సమీప అడవిలో వదిలేశాడు. పాములు లేవన్న తరువాత రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

తాగునీటిలో విషప్రయోగం

శివ్వంపేట(నర్సాపూర్): పశువుల తాగునీటి తొట్టిలో గుర్తుతెలియని వ్యక్తులు పురుగుల మందు కలిపారు. ఈ సంఘటన మండల పరిధి చెండి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఆంజనేయులు గ్రామ శివారులో డైరీఫామ్ ఏర్పాటు చేసుకున్నాడు. పాడిగేదెల తాగునీటి కోసం ఎర్పాటు చేసిన నీటి తొట్టిలో గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి పురుగుల మందు కలిపారు. నీటి తొట్టి నుంచి వస్తున్న వాసన గ్రహించిన ఆంజనేయులు పశువులు అటువైపుకు వెళ్లకుండా ఆ నీటిని తొలగించాడు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. పశువులను చంపేందుకు నీటి తొట్టిలో పురుగుల మందు కలిపారని, వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆంజనేయులు కోరాడు.

మిషన్ భగీరథ హెడ్‌వర్క్స్ సందర్శన


జల్ జీవన్ మిషన్ బృందానికి నీటి సరఫరాపై అవగాహన కల్పిస్తున్న డీఈఈ నాగార్జున

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ మండలం కోమటిబండ గుట్టపై ఉన్న మిషన్ భగీరథ హెడ్‌వర్క్స్ ప్రాంతాన్ని మధ్యప్రదేశ్‌కు చెందిన జల్‌జీవన్ మిషన్ బృందం మంగళవారం సందర్శించింది. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జల్‌జీవన్ మిషన్ అమలు, నిర్వహణకు ఆ రాష్ట్ర సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, ఇంజనీర్లకు డీఈఈ నాగార్జున మిషన్ భగీరథ ప్రాజెక్టు అమలు తీరు వివరించారు. గోదావరి నీటి శుద్ధీకరణ, ఇంటింటికీ గ్రావిటీ ద్వారా తాగునీటి సరఫరా తదితర అంశాలు చెప్పారు.

వాటర్ పైప్‌లైన్ గుంతలోపడి యువకుడి మృతి


ఆనంద్ మృతదేహం

సిద్దిపేటకమాన్: వాటర్ పైప్‌లైన్ కోసం తవ్విన గుంతలో బైక్‌తో పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన సిద్దిపేట పట్టణ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. సిద్దిపేట వన్ టౌన్ సీఐ భిక్షపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నూరి ఆనంద్ (24) వృత్తిరీత్యా డ్రైవర్. భార్యాపిల్లలతో నంగునూర్‌లో నివాసంలో ఉంటున్నాడు. సిద్దిపేటలో బంధువుల ఇంట్లోని ఫంక్షన్‌కు సోమవారం రాత్రి వచ్చాడు. తిరిగి మంగళవారం ఉదయం బైక్‌పై నంగునూరు వెళుతున్నాడు. మార్గమధ్యలో సిద్దిపేట నాగదేవత ఆలయం, రేణుక ఎల్లమ్మ టెంపుల్ మధ్యలో బైపాస్ పక్కన వాటర్ పైప్ లైన్ కోసం గుంత తీశారు. అందులోపడిన ఆనంద్ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. వాటర్ పైప్‌లైన్ కోసం తీసిన గుంత వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంవల్లే గుంతలోపడి తన కుమారుడు మృతి చెందాడని మృతుడి తండ్రి చంద్రయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రిజర్వాయర్‌లో పడి జాలరి మృతి


పోచయ్య (ఫైల్)

బెజ్జంకి(సిద్దిపేట): చేపల వేటకు వెళ్లిన ఓ జాలరి నీట మునిగి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దాచారం గ్రామానికి చెందిన జాలరి రెడ్డవేని పోచయ్య(68) మంగళవారం తోటపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో చేపలు పట్టేందుకు వెళ్లాడు. రిజర్వాయర్‌లో చేపలు పడుతుండగా ఒక్కసారిగా గాలి ఎక్కువగా వీయడంతో పోచయ్య తెప్ప బోర్లా పడటంతో నీటిలో గల్లంతయ్యాడు. గమనించిన మిగిలిన జాలరులు గ్రామస్తులకు సమాచారమిచ్చారు. జాలర్లు గాలించగా పోచయ్య మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య, కుమారుడు, కూతురున్నారు. సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ సంఘటనా స్థలానికి వెళ్లి సానుభూతి వ్యక్తం చేశారు.

సమష్టి కృషికి ఫలితం

ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు


మంత్రి హరీశ్ రావు

సిద్దిపేటజోన్: స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 గ్రామీణ ర్యాంకింగ్‌లలో మొదటి త్రైమాసిక ఫలితాల్లో సిద్దిపేట జిల్లా మొదటి స్థానంలో నిలవడం అభినందనీయమని, సమష్టి కృషికి ఫలితమని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. సీఎం కేసీఆర్ చేపట్టిన పల్లె ప్రగతి ద్వారా జిల్లా స్వరూపం మారిందన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగి, స్వచ్ఛతలో జిల్లా మేటిగా నిలిచిందన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఇంటింటికి వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, తడి, పొడి, హానికర చెత్త విభజన, పునర్వినియోగం తదితర అంశాలు విజయవంతం చేయడంతో స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 లో సిద్దిపేట త్రీస్టార్ రేటింగ్ నుంచి ఫోర్ స్టార్ రేటింగ్ రావడం సంతోషంగా ఉందన్నారు. మొదటి త్రైమాసిక ఫలితాల్లో సిద్దిపేట జిల్లా దేశంలో మొదటి స్థానంలో నిలవడం గర్వంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో మరింత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్‌ను మంత్రి అభినందించారు.

రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్న కేంద్రం

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతూ అభివృద్ధిని అడ్డుకుంటుందని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఆరోపించారు. మంగళవారం మండలంలోని సాలాఖపూర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మండల కేంద్రంలోని తాజ్‌గార్డెన్‌లో కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం కల్యాణలక్ష్మి లబ్ధిదారులతో కలిసి భోజనం చేశారు. అలాగే సలాఖపూర్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతకు ముందు మర్మాముల గ్రామంలోని కంటి వెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలతమల్లేశం, మద్దూరు, దూల్మిట్ట బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్, మంద యాదగిరి, తిరుపతిరెడ్డి, వంగ భాస్కర్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి: పలువురిపై కేసు నమోదు

దుబ్బాకరూరల్: ఓ వ్యక్తిపై పలువురు దాడి చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన పయ్యావుల దేవయ్య(48) సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బైక్‌పై దుబ్బాక వస్తున్నాడు. మార్గం మధ్యలో అతడిని అడ్డుకుని ఐదుగురు దాడిచేశారు. బాధితుడికి కాలు విరగడంతో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం బాధితుడి కూతురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి చేసిన గంగరాజు, బాలమల్లు, వెంకట్, నరేష్, రాజయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఒగ్గు పూజారుల విషయంలో దాడి జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రీతి ఘటనపై విచారణ చేపట్టాలి

సిద్దిపేటకమాన్: వరంగల్ మెడికల్ కళాశాల పీజీ విద్యార్థిని ప్రీతి ఘటనపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని, ఆమె మృతికి కారణమైన సైఫ్‌ను చట్టరీత్యా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట పట్టణంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మంగళవారం సైఫ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ.. ర్యాగింగ్‌కు బలైౖ మెడికల్ విద్యార్థిని ప్రీతి, ఇంజినీరింగ్ విద్యార్థిని రక్షిత చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి మృతికి కారణమైన నిందితులను చట్టరీత్యా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నేతలు విద్యానాథ్, సందీప్, ప్రణయ్, వెంకటేశ్, గణేశ్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ విద్యార్థుల రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని గాంధీ చౌరస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి బీసీ హాస్టల్ విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు. నాసికరం భోజనం పెడుతున్నారని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. హాస్టల్‌లో నాసికరం భోజనం, నీళ్ల చారుతో అన్నం పెడుతున్నారని, ఆ అన్నం తినలేక ఆర్థాకలితో అలమటిస్తున్నామని తెలిపారు. ఏదేమిటని వార్డెన్‌ను అడిగితే బెదిరిస్తున్నాడని వాపోయారు. ఒక్క రోజు కాదు రెండు రోజులు కాదు నిత్యం ఇదే పరిస్థితి నెలకొందన్నారు. అన్నంలో లక్క పురుగులు, రాళ్లు వస్తున్నాయని, ఓ వైపు ఆకలి, మరో వైపు తినలేని దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించి వార్డెన్‌ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. పోలీస్‌లు వచ్చి ఆందోళనను విరమింపజేశారు.

చెరువు స్థలం కబ్జాకు యత్నం


చెరువు స్థలంలో బండరాళ్లను వేసిన దృశ్యం

రామాయంపేట(మెదక్): చెరువు స్థలాన్ని కొందరు కబ్జాకు యత్నించారు. గ్రామస్తులు అధికారలకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి అడ్డుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఝాన్సి లింగాపూర్ పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉంది. అలుగువైపు మట్టి, బండరాళ్లను జేసీబీతో తవ్వుతుండగా గ్రామస్తులు అధికారులకు సమాచారం అందజేశారు. తహసీల్దార్ మన్నాన్, నీటిపారుదలశాఖ ఏఈ కుషాల్ చెరువు వద్దకు వెళ్లి పరిశీలించారు. అక్కడ ఉన్న జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఏఈ ఫిర్యాదు చేశారు.